క్లుప్తంగా

ఎన్నికల విధులపై అవగాహన



ఇందల్వాయి: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఇందల్వాయి పోలీసులతో డిచ్‌పల్లి సీఐ వినోద్ సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమావేశమయ్యారు. ఎన్నికలు ముగిసే వరకు పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో శాంతి భద్రతలు అదుపు తప్పకుండా పర్యవేక్షించాలని సూచించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నన్ని రోజులు పోలీసుల విధులు, అనుసరించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు. గ్రామ పోలీస్ అధికారులు ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని, సమాచార సేకరణ, విశ్లేషణ,చర్యలు వేగంగా ఉండాలన్నారు. ఎస్సై సందీప్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్కుల పంపిణీ



మోపాల్: మండలంలోని సిర్‌పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ జెమ్స్ నిజామాబాద్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు రాత పుస్తకాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా క్లబ్ అధ్యక్షుడు పాకాల నర్సింహారావు మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని పాఠశాల, గ్రామానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించారు. క్లబ్ ఆధ్వర్యంలో అనేక స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని, భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, క్లబ్ సభ్యులు గంజి రమేష్, గిరీష్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వీపర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ధర్పల్లి: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న స్వీపర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు జీ. సుమలత ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు.

రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని పరామర్శించిన వినయ్‌రెడ్డి



నిజామాబాద్ రూరల్: నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి రూరల్ క్యాంపు కార్యాలయంలో సోమవారం పరామర్శించారు. గత నెల 29న ఎమ్మెల్యే భూపతి రెడ్డి తల్లి లక్ష్మి నర్సమ్మ మృతి చెందిన విషయం తెలిసిందే. రేకులపల్లి లక్ష్మినర్సమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన వెంట ఆర్మూర్ ఏఎంసీ చైర్మన్ సాయిబాబా గౌడ్, కాంగ్రెస్ నాయకులు పండిత్ పవన్, అశోక్ భూపేందర్, నటరాజ్, కాంగ్రెస్ కార్యకర్తలు ఉన్నారు.

నేడు పుట్ట ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

బాల్కొండ: మెండోరా మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పుట్ట ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించబడుతుందని గౌడ సంఘ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	1,23,500	వెండి(కిలో)	1,57,000
22 క్యారెట్స్	1,14,127		- నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సింగ్	220
		లైవ్	180
స్కిన్‌లెస్	260	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	16	32	గాజరుగడ్డ	40	80
బెండకాయ	40	80	పచ్చిమిర్చి	30	60
బీరకాయ	50	100	దోసకాయ	30	60
దొండకాయ	50	100	ఆలుగడ్డ	30	60
బీర్నీసుకాయ	100	180	గోబిగడ్డ	25	50
కాకరకాయ	40	80	గోబిపువ్వు	50	100
వంకాయ	40	80	బీట్‌రూట్	40	80
పాలకూర	80	160	కరివేపాకు	40	80
మెంతికూర	100	180	చామగడ్డ	30	60
కొత్తిమీర	80	160	చిక్కుడుకాయ	50	100
పుదీనా	50	100	గోరుచిక్కుడు	70	140
క్యాప్సికం	50	100			-సుభాష్‌నగర్

ఇందిరమ్మ ఇళ్ల యాప్ బ్లాక్

- కార్పొరేషన్‌లో ఎన్నికల కోడ్ అమలు
- ఇళ్ల నిర్మాణానికి అడ్డంకిగా మారిన పరిస్థితి
- కొత్తగా ఇంటి నిర్మాణం చేపట్టేవారికి నిరాశ
- 145 మున్సిపాలిటీల్లో ఇదే పరిస్థితి



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, కమిషనర్ (ఫైల్)



ఎన్నికల కోడ్‌తో సర్వీసు నిలిపివేసినట్లు యాప్‌లో మెసేజ్

నిజామాబాద్ సిటీ: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ వెనుకబడింది. గ్రామాలతో పోల్చితే కార్పొరేషన్ పరిధిలో ఈ ప్రక్రియ చాలా ఆలస్యంగా ప్రారంభమైంది.ఈనేపథ్యంలో ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నిక నోటిఫికేషన్ వెలవడటంతో రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో మున్సిపల్ పరిధిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం ప్రారంభించేవారికి ఎన్నికల కోడ్ అడ్డంకిగా మారింది.145 మున్సిపాలిటీల్లో ఈసమస్యను ఎదుర్కొంటున్నారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గానికి ప్రభుత్వం 3500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరుచేసింది. ఇందులో దాదాపు 20 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. అన్ని ధృవపత్రాలు పరిశీలించి ఇప్పటివరకు 1,734 మందికి ప్రొసీడింగ్‌లు అందించారు. వారిలో 928 మంది ముగ్గుపోసి పనులు ప్రారంభించారు. ఇంకా 806 మంది పనులు ప్రారంభించలేదు.

100 మంది వరకు..

ఇటీవల ఇందిరమ్మ ఇంటి నిర్మాణం చేపట్టేందుకు అన్ని అనుమతి పత్రాలు పొంది అధికారులకు సమాచారం ఇచ్చి త్వరలో ముగ్గుపోసే కార్యక్రమం చేపడతామని దాదాపు 100 మంది లబ్ధిదారులు సిద్ధమయ్యారు. ఈ లోపు ఎన్నికల కోడ్ వచ్చింది. దాంతో మళ్లీ ఇంటి నిర్మాణం ఎప్పుడు చేపడతామోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

'ఎన్నికల కోడ్ దృష్ట్యా ఈ సేవలు నిలిపివేయబడినవి'

గ్రామ, మండల స్థాయిలో ఎన్నికలు జరుగుతున్నాయి. తప్ప మున్సిపల్ పరిధిలో జరగడం లేదు. ఈఎన్నికల కోడ్ మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లకు వర్తించదు. అభివృద్ధి పనులకు కోడ్ అడ్డంకి కాదు. కాగా, ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో వివరాలు నమోదు చేస్తే మాత్రం సైట్ అంగీకరించడం లేదు. పత్రాలు అప్‌లోడ్‌కావడం లేదు. 'ఎన్నికల కోడ్ దృష్ట్యా ఈ సేవలు నిలిపివేయబడినవి' అనే సందేశం వస్తోంది. ఎన్నికల కమిషన్ క్లియర్‌చేస్తే తప్ప ఈ నిబంధన సడలించబడదు. కార్పొరేషన్ పరిధిలో ఎన్నికలు లేకపోయినా, కోడ్‌తో అభివృద్ధి పనులు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది.

మంచిరోజులని ఎదురుచూస్తే..

ఇళ్లు మంజూరై పనులు ప్రారంభించేందుకు ఇప్పటి వరకు అనేక ఇబ్బందులు ఎదురయ్యాయి. వరుసగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురవడంతో కొంతమంది వెనక్కి తగ్గారు. కీడు రోజులు అని కొంత మంది వేచిచూశారు. దసరా పండుగ తర్వాత మంచి రోజులున్నవని, తర్వాత పనులు ప్రారంభించుకుందామంటే ఎన్నికల కోడ్ రావడంతో తాము ఇళ్ల నిర్మాణ పనులు ఎప్పుడో ప్రారంభిస్తామోనని లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది.

ఇందిరమ్మ ఇళ్ల సైట్ పనిచేస్తలేదు

నాకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. ఇల్లు కట్టుకునేందుకు డబ్బులు లేకపోతే మా మహిళా సంఘం నుంచి లక్ష రుణం ఇప్పించారు. ఇంటి నిర్మాణ పనులు చేద్దామనుకుంటే సైట్ పనిచేయడం లేదు. ఎన్నికలకోడ్ అని వస్తుంది. యాప్‌లో పేపర్లు అప్లోడ్ చేస్తేనే పనులు ప్రారంభించాలని వార్డు ఆఫీసర్లు చెబుతున్నారు. – రమావత్ లల్లాబాయి, లబ్ధిదారు, డీఎస్ కాలనీ, నాగారం

ఇబ్బందులు లేకుండా చూడాలి

ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు బల్దియాలో నత్తనడకన సాగుతున్నాయి. దసరా తర్వాత మంచి రోజులున్నాయని, చాలా మంది పనులు ప్రారంభించలేదు. ఇప్పుడు పనులు ప్రారంభిస్తామనుకుంటే ఎన్నికల కోడ్ వచ్చింది. ఎన్నికలు మున్సిపల్‌లో జరగడం లేదు, అధికారులు యాప్‌లో మార్పులు చేయాలి. లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలి. –న్యాలం రాజు, బీజేపీ మాజీ కార్పొరేటర్

సమస్యను త్వరలోనే పరిష్కరిస్తాం

ఎన్నికల కోడ్ వచ్చిన నాటి నుంచి ఈ సమస్య వచ్చింది. ఎన్నికలు మున్సిపల్ పరిధిలో లేనందున యాప్‌లో మార్పులు చేయాలని సీఈ దృష్టికి తీసుకువచ్చాం. త్వరలోనే ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో మార్పులు చేయనున్నారు. ఈసమస్యకు పరిష్కారం త్వరలోనే లభిస్తుంది. లబ్ధిదారులు ఆందోళన చెందవద్దు. –నివర్తి, పీడీ హౌజింగ్

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి



కులాస్‌పూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ రేఖ



రావుట్లలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మోపాల్: మండలంలోని కులాస్ పూర్, బాడ్సి, మంచిప్ప గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ రేఖ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర, బోనస్ పొందాలని తెలిపారు. ఏ గ్రేడ్ రకానికి క్వింటాల్‌కు రూ.2389, బీ గ్రేడ్ రకానికి రూ.2369 ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. దళారులకు విక్రయించి మోసపోవద్దని సూచించారు. వర్షాలకు తడవకుండా టార్పాలిన్లు కప్పి ఉంచాలన్నారు. తాలు లేకుండా చెన్ని పట్టాలని, ఎలాంటి సమస్యలు ఉన్నా అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజేశ్వర్, సొసైటీ సీఈఓ నర్సయ్య, జీపీఓలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ మండలంలో..

సిరికొండ : మండలంలోని రావుట్ల, జంగిలోడి తండా, చీమన్‌పల్లి గ్రామాల్లో ఐడీసీఎంఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. డీసీసీ కార్యదర్శి ఎర్రన్న, డీలర్ రమేష్, సామెల్, ప్రసాద్, శివాజీ నాయక్, భాస్కర్, గంగారెడ్డి, దాసు ,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'మంచిప్ప' ప్రాజెక్ట్‌ను త్వరగా పూర్తిచేయాలి



తహసీల్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

మోపాల్: మంచిప్ప ప్రాజెక్ట్ 21వ ప్యాకేజీ పనులు త్వరగా పూర్తి చేసి నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని 84వేల ఎకరాలకు సాగునీరు అందించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అగ్గు ఎర్రన్న డిమాండ్‌చేశారు. ఈమేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ రేఖకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా అగ్గు ఎర్రన్న మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం మంచిప్ప రిజర్వాయర్ నిర్మాణం చేపట్టిందని, అంచనా వ్యయాలు పెంచుతూ నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. ఈ ప్రాజెక్ట్ పనులు పూర్తి కావడానికి రూ.రెండు వేల కోట్లు విడుదల చేసి పనులు పూర్తి చేయాలని డిమాండ్‌చేశారు. ప్రాజెక్టు పరిధిలో ఆరు మండలాల్లోని 77 గ్రామాలు, వాటి అనుబంధ తండాలకు 84వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ప్రాజెక్ట్ ఎత్తు పెంచకుండా ప్రభుత్వం జీవో విడుదల చేసి పనులు ప్రారంభించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో నాయకులు అగ్గు చిన్నయ్య, కార్యదర్శి బండమీది నర్సయ్య, గంగాధర్, భుజేందర్, కట్లి గంగాధర్, సాయిలు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

మానిక్‌బండార్‌లో నీటి ఇబ్బందులు



మాక్లూర్: మండలంలోని మానిక్‌బండార్‌లో 15 రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ విషయమై సోమవారం సంబంధిత నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారికి ఫోన్‌చేసిన స్పందించటం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. మిషన్ భగీరథ అధికారులు స్పందించి నీటి సరఫరా చేపట్టాలని కోరుతున్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కీం ట్యూషన్ ఫీజు చెల్లించాలి

వేల్పూర్: బెస్ట్ అవైలబుల్ స్కీంలో భాగంగా ప్రైవేటు విద్యాసంస్థల్లో చదువుకుంటున్న ఎస్సీ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ట్యూషన్ ఫీజు వెంటనే విడుదల చేయాలని అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సొడ జయరాజ్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం ట్యూషన్ ఫీజు చెల్లించకపోవడంతో ప్రైవేటు విద్యాసంస్థలు తల్లిదండ్రులకు ఫోన్ చేసి ఫీజు చెల్లించండి లేదా పిల్లల్ని తీసుకెళ్లండి అంటూ ఫోన్‌లు చేస్తున్నారని పేర్కొన్నారు.

ఐదు గ్రామాలకు డబుల్ రోడ్డు!

- తొండాకూర్ నుంచి నూత్‌పల్లి వరకు...
- ప్రతిపాదనలు రూపొందిస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారులు



తొండాకూర్‌లో డబుల్ రోడ్డు వేసేది ఇక్కడి నుంచే..

దొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలో పలు గ్రామాలకు త్వరలోనే డబుల్ రోడ్డు సౌకర్యం రానుంది. ఇరుకుగా మారిన తొండాకూర్ నుంచి ఇతర గ్రామాలకు వెళ్లే సింగిల్ రోడ్డును డబుల్ చేయనున్నారు. ప్రజల డిమాండ్ మేరకు చొరవ తీసుకున్న ప్రజాప్రతినిధులు ఆర్‌అండ్‌బీ అధికారులతో సర్వే చేయిస్తున్నారు. త్వరలోనే ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపనున్నారు. ఈ మేరకు అధికారులు కసరత్తును ప్రారంభించారు. తొండాకూర్ నుంచి దత్తాపూర్, మారంపల్లి, నూత్‌పల్లి, గంగాసముందర్ గ్రామాల మీదుగా దాదాపు 9.4 కిలో మీటర్లు డబుల్ రోడ్డు వేయాలని నిర్ణయించారు. ఇందుకు సుమారు రూ.18కోట్ల వరకు వ్యయం కానున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతంపై ఐదు గ్రామాలకు వెళ్లడానికి సింగిల్ రోడ్డే ఉంది. ఈరోడ్డు ఇరుకుగా మారడంతో ఆర్టీసీ బస్సులు, లారీలు, ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బంది మారింది. ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. సమస్య ప్రజాప్రతినిధుల దృష్టికి రావడంతో ప్రతిపాదనలు తయారు చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు. రోడ్డు మంజూరై పనులు ప్రారంభమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పనున్నాయి. త్వరలోనే సర్వే చేసి ప్రతిపాదనలు రూపొందిస్తామని ఆర్‌అండ్‌బీ శాఖ ఏఈ రఘు 'సాక్షి'కి తెలిపారు.

రాకపోకలు సులువవుతాయి



తొండాకూర్ మీదుగా మి గతా నాలుగు గ్రామాలకు సింగిల్ రోడ్డు మాత్రమే ఉంది. రోడ్డు ఇరుకుగా మారింది. సమస్యను గుర్తించి డ బుల్ రోడ్డు వేసేందుకు ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రతిపాదను తయారు చేయ డం సంతోషకరం. రాకపోకలు మరింత సులువు అవుతాయి. – టి.ముత్యం, తొండాకూర్

ప్రమాదాల నివారణకు సహకరించాలి



వర్ని : విద్యుత్ వల్ల జరిగే ప్రమాదాల నివారణకు రైతులు, ప్రజలు సహకరించాలని విద్యుత్ శాఖ ఏడీఈ తోట రాజశేఖర్ సూచించారు. సోమవారం వర్ని మండల కేంద్రంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలం బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ పొలాల వద్ద తెగిపడిన విద్యుత్ వైర్లను, ట్రాన్స్‌ఫార్మర్లను ముట్టుకోవద్దని, విద్యుత్ వైర్లకు దగ్గరగా భవనాల నిర్మాణం చేపట్టరాదని సూచించారు. గ్రామాల్లో, వ్యవసాయ పొలాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఏవైనా సమస్యలు ఉంటే సంబంధిత విద్యుత్ అధికారులకు సమాచారం అందించాలని వారు స్పందించనిచో 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ ఇంజినీర్ బాలకృష్ణ, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, లైన్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, రాజేందర్, లైన్‌మన్ చిన్నబాబు, జేఎల్ఎం నరేష్, శివలాల్ పాల్గొన్నారు.

వైభవంగా వసంతోత్సవ వేడుకలు



వసంతోత్సవ వేడుకల్లో పాల్గొన్న కమాండెంట్ సత్యనారాయణ దంపతులు

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండలంలోని తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీస్ ఏడో బెటాలియన్ లో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం లక్ష్మీవేంకటేశ్వర స్వామి వసంతోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. కమాండెంట్ సత్యనారాయణ, భవాని దంపతులు, అడిషనల్ కమాండెంట్ సీహెచ్‌సాంబశివరావు దంపతులు వసంతోత్సవం, డోలోత్సవం, హోమ కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా స్వామి వారికి ఉదయం నిత్య వాహనము, వసంతోత్సవం, డోలోత్సవం, బలిహరణం కార్యక్రమాలు నిర్వహించారు. బెటాలియన్ ఏఆర్ ఎస్ఐ ఏపీ కృష్ణారావు దంపతులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం సామూహిక కుంకుమార్చన లో సుహాసినులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవ వేడుకల్లో అసిస్టెంట్ కమాండెంట్స్ కేపీ శరత్‌కుమార్, కేపీ సత్యనారాయణ, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది, కుటుంబ సభ్యులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న సుహాసినులు

కార్మిక సంక్షేమ బోర్డును పరిరక్షించాలి



మాట్లాడుతున్న నీలం సాయిబాబా

నిజామాబాద్ సిటీ : భవన నిర్మాణ కార్మికులకు చట్ట ప్రకారం ఇవ్వవలసిన 11 రకాల సంక్షేమ పథకాల అమలును నీరుగార్చేకుట్రలను తిప్పికొట్టాలని, బోర్డు పరిరక్షణకు పోరాటాలు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి నీలం సాయిబాబా అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని కోటగల్లి ఎన్ఆర్‌భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్నాయని మండిపడ్డారు. అనేక సమరశీల పోరాటాల ద్వారా కార్మికులు సాధించుకున్న హక్కులను ప్రభుత్వాలు కాలరాయాలని చూస్తున్నాయని వీటిని ఐక్య కార్మిక ఉద్యమాల ద్వారా హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి మోహన్, నర్సింగరావు, తాంపే రాజు, లింగం, మల్లేష్, అరుణ్, డానియల్, తప్పెట్ల రాజు, డి.రమేష్ పాల్గొన్నారు.

సామాజిక సేవాకార్యక్రమాలు స్ఫూర్తిదాయకం



పాఠశాలకు చెక్కు అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

మోపాల్: జోస్ ఆలుక్కాస్ సంస్థ సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం స్ఫూర్తిదాయకమని పాఠశాల హెచ్ఎం నవనీత పేర్కొన్నారు. సోమవారం మండలకేంద్రంలోని మోపాల్ ప్రైమరీ పాఠశాలకు ఆలుక్కాస్ సంస్థ ఆధ్వర్యంలో సీఎస్ఆర్ ఫండ్ ద్వారా కొనుగోలు చేసిన వస్తువులను బ్రాంచ్ మేనేజర్ ధనిష్ అందజేశారు. ఈసందర్భంగా నవనీత మాట్లాడుతూ పాఠశాలకు రూ.2.29లక్షలు సీఎస్ఆర్ ఫండ్ అందజేశారని, ఆ ఫండ్‌తో నీటిశుద్ధి యంత్రం, డిజిటల్ పాఠాలు బోధించడానికి టీవీ, డ్యూయల్ డెస్క్ బెంచీలు, మైక్ సెట్, ప్రింటర్, తదితర సదుపాయాలు కల్పించారన్నారు. జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం ప్రసాద్, ఉపాధ్యాయులు శ్రీదేవి, మహేందర్, రాజ్‌కుమార్, నాగలక్ష్మి, సుష్మ, జోస్ ఆలుక్కాస్ అకౌంట్స్ మేనేజర్ జితిన్, పీఆర్‌వో పిప్పెర నరేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన మాజీ సర్పంచ్

రెంజల్(బోధన్): మండలంలోని కళ్యాపూర్ మాజీ సర్పంచ్ మైని మోహన్ కాంగ్రెస్‌ను వదిలి సోమవారం బీజేపీలో చేరారు. హైదరాబాద్‌లోని ఎంపీ ధర్మపురి అర్వింద్ నివాసంలో మోహన్‌కు కండువా కప్పి పార్టీలోకి అర్వింద్ ఆహ్వానించారు. ఆయనతో పాటు బోర్గాంకు చెందిన మోహన్‌రెడ్డి, కళ్యాపూర్‌కు చెందిన రమణలు ఉన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాశ్‌రెడ్డి, మండల ఎన్నికల ఇన్‌చార్జి కూరెళ్ల శ్రీధర్, మండల పార్టీ అధ్యక్షుడు క్యాతం యోగేశ్, నాయకులు ఉన్నారు.



బీజేపీలో చేరిన నాయకులతో ఎంపీ అర్వింద్

స్వచ్ఛందంగా గుంతలు పూడ్చిన యువకులు



గుంతలను పూడ్చివేస్తున్న యువకులు

మాక్లూర్ : మండలంలోని చిక్లి నుంచి బ్రిలియంట్ పాఠశాల వరకు సుమారు 3 కిలోమీటర్ల పొడవున రోడ్డు పెద్ద గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. దీంతో సోమవారం స్థానిక యువకులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు కలిసి స్వచ్ఛందంగా సొంత ఖర్చులతో గుంతలను పూడ్చి సీసీ వేశారు. ఇటీవల ఈ గుంతల కారణంగా రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఈకార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి నవీన్‌కుమార్, కారోబార్ పి సాయిలు, చిక్లి మాజీ ఎంపీటీసీ భోజన్న, షబ్బీర్, ఒరికె దేవేందర్, రాజు, ఒడ్డె పెద్ద గంగారాం, చాకలి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.